ప్రజాశక్తి



హాల్‌టిక్కెట్లు నిరాకరిస్తే చర్యలు

బాలల హక్కుల కమిషన్ సభ్యులు సీతారాం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో పది, ఇంటర్మీడియట్ పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు ఫీజులు చెల్లించని కారణంతో హాల్‌టిక్కెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేసే పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలపై చర్యలు తప్పవని బాలల హక్కుల కమిషన్ సభ్యులు గొండు సీతారాం ఒక ప్రకటనలో హెచ్చరించారు. కమిషన్ తరుపున ఇప్పటికే విద్యాశాఖ కార్యాలయానికి, ఆర్ఐఒ కార్యాలయాలకు లేఖలు రాసినట్లు తెలిపారు. నిబంధనలను అతిక్రమించి విద్యార్థులను వేధింపులకు గురిచేస్తే గుర్తింపు రద్దుకు సిఫార్సులు చేస్తామన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు గుర్తెరిగి ఈ వెబ్‌సైట్ ద్వారా హాల్‌టిక్కెట్లను పొందే వెసులు బాటును వినియోగించుకోవాలని సూచించారు.

ప్రాజెక్టులను పూర్తి చేస్తామంటూ ప్రతిపక్షంగా హామీ ఇస్తున్న పార్టీలు ఆనక అధికారంలోకి వచ్చిన తర్వాత వాటి ఊసెత్తడం లేదు. దీంతో ఆ ప్రాజెక్టుల పనుల ప్రతిపాదనలకే పరిమితమవుతున్నాయి. అటువంటి ముఖ్యమైన సాగునీటి ప్రాజెక్టుల్లో వంశధార ఆధునికీకరణ పనులు ముఖ్యమైనవి. పాలకుల నిర్లక్ష్యంతో ఏళ్ల తరబడి మోడర్నైజేషన్ పనులు గురయ్యాయి. అప్పుడెప్పుడో నిర్మించిన కాలువలను పటిష్టం చేసేందుకు ఉద్దేశించిన ఆధునికీకరణ పనులను విస్మరించడంతో శివారు భూములకు నీరందక రైతులు అవస్థల పడుతున్నా పాలకులకు పట్టడం లేదు. కుడి, ఎడమ కాలువలు బలహీనంగా ఉండటంతో గొట్టాబ్యారేజీలో నీటి నిల్వలు ఉంటున్నా సామర్థ్యం మేరకు నీరు వదల్లేని పరిస్థితి నెలకొంది. కాలువల్లో నీరు ఉధృతంగా ప్రవహిస్తున్న సమయంలో కొన్నిచోట్ల గండిపడిన ఘటనలూ చోటు చేసుకున్నాయి.



సరుబుజ్జిలి మండలం శ్యామలాపురం సమీపంలో కాలువ దుస్థితి (ఫైల్ ఫోటో)

అటకెక్కిన ఆధునికీకరణ

- ప్రాజెక్టులను పూర్తి చేస్తామంటూ ప్రతిపక్షంగా హామీ
- అధికారంలోకి వచ్చిన తర్వాత నిధులు కేటాయించని వైనం
- ఎనిమిదేళ్లుగా వంశధార మోడరనైజేషన్‌పై నిర్లక్ష్యం
- నష్టపోతున్న ఆయకట్టు రైతాంగం

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

హిరమండలం మండలం గొట్టా బ్యారేజీ నుంచి నీటిని విడిచిపెడుతున్న ఎడమ వైపు కాలువ పరిస్థితి దయనీయంగా ఉంది. కాలువ నుంచి 12 మండలాల పరిధిలోని 1,48,000 ఎకరాలకు సాగునీరందించేలా కాలువను నిర్మించారు. కాలువ నుంచి 2,480 క్యూసెక్కుల నీరు విడిచి పెట్టేలా కాలువను డిజైన్ చేశారు. బ్యారేజీలో నీటి నిల్వలు పుష్కలంగా ఉన్న రోజుల్లోనూ 1800 క్యూసెక్కులకు మించి విడిచిపెట్టలేని పరిస్థితి నెలకొంది. కాలువలు నిర్వహణ లేకపోవడం, గట్టు బలహీనంగా ఉండటంతో అంతకుమించి నీటిని వదిలితే గండికొట్టే ప్రమాదముందా లేకపోలేదు. కాలువ వాస్తవ సామర్థ్యం మేరకు నీటిని విడిచిపెట్టలేకపోవడంతో ప్రతి సంవత్సరమూ పలాస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని వేలాది ఎకరాల భూములు ఎండిపోతున్నాయి. తుపాన్లు, నీటి ప్రవాహ ఉధృతికి క్రమేణా కాలువ గట్టు కోతకు గురవుతున్నాయి. 40 ఏళ్ల కిందట రాతితో నిర్మించిన నిర్మాణాలు ప్రస్తుతం దెబ్బతినడంతో ఎడమ కాలువ సామర్థ్యం అంతకంతకూ తగ్గిపోతోంది. ఎడమ కాలువను ఆధునికీకరించాల్సిన అవసరముందంటూ గత తొమ్మిదేళ్లగా అధికారులు ప్రతిపాదనలు పంపుతునే ఉన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సారి 2016లో రూ.456 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. ఆ తర్వాత చివరి సారిగా 2018లో రూ.624 కోట్లతో పంపారు. వైసిపి అధికారంలోకి వచ్చిన తర్వాత 2019 లో మొదటిసారి పంపారు. 2021 మార్చిలో రూ.776 కోట్లతో, 2023 నవంబరులో రూ.954 కోట్లతో ప్రతిపాదనలు పంపారు.

రెండు పర్యాయాలు కోతకు గురయిన గట్టు

వంశధార కాలువలు, గొట్టాబ్యారేజీ ప్రాంతం ఎంత బలహీనమో రెండు సందర్భాల్లో చోటుచేసుకున్న ఘటనలే అందుకు ఉదాహరణ. 2023 అక్టోబరులో వంశధారలో 80 వేల క్యూసెక్కు వరదనీరు ప్రవహిస్తున్న సందర్భంలో బ్యారేజీ దిగువ కుడివైపు గట్టు కోతకు గురైంది. గట్టును రూ.13.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టారు. ఆదేవిధంగా హిరమండలం అక్కరాపల్లి 2022 జూలైలో అండర్ టన్నల్ వద్ద కాలువకు గండి పడింది. దానిని రూ.5 లక్షలతో తాత్కాలిక మరమ్మతులు చేపట్టి కాలువలకు నీరు విడిచిపెట్టారు. వంశధార ఉధృతంగా ప్రవహిస్తే కాలువలు, గొట్టాబ్యారేజీ గట్టు ఎప్పుడు ఏది కొట్టుకుపోతాయా అన్న పరిస్థితి నెలకొంది. తొమ్మిదేళ్లుగా నిర్లక్ష్యం చేసిన పాలకులు ఎన్నికలు వస్తుండటంతో టిడిపి, వైసిపిలు మరోసారి సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని ప్రచారస్త్రంగా వినియోగించుకోవాలని చూస్తున్నాయి. సాగునీటి ప్రాజెక్టుల అంశాన్ని ఒక ఆజెండా మార్చి అవి పూర్తయ్యేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాల్సిన బాధ్యత ప్రజలు, రైతులపై ఉంది.



సంఘీభావం తెలుపుతున్న గోవిందరావు

కార్మిక సంక్షేమ చట్టాన్ని పునరుద్ధరించాలి

ప్రజాశక్తి- నరసన్నపేట

రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిన నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టం పునరుద్ధరించి కార్మికులకు న్యాయం చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు ఎం.ఆదినారాయణ మూర్తి, నరసన్నపేట నియోజకవర్గ కార్యదర్శి తర్ల లక్ష్మణరావులు డిమాండ్ చేశారు. స్థానిక లక్ష్మి థియేటర్ సెంటర్ వద్ద భవన నిర్మాణ కార్మిక సంఘం ఆధ్వర్యాన రిలే నిరాహార దీక్ష బుధవారం చేపట్టారు. ఈ శిబిరాన్ని వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొని పోరాటానికి సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని లక్ష మంది నిర్మాణ కార్మికుల కుటుంబాలకు సంబంధించిన సంక్షేమ చట్టం అమలును గతేడాది సెప్టెంబరు 20న మెమో 1214 జారీ చేసి రాష్ట్ర ప్రభుత్వం నిలుపుదల చేసిందన్నారు. ఫలితంగా జిల్లాలో సుమారు 8 వేల క్లెయిమ్‌ల అపరిష్కృతంగా ఉండిపోయాయని అన్నారు. ఇది నిర్మాణ కార్మికులకు తీవ్ర అసంతృప్తి కలిగించిందన్నారు. ప్రభుత్వ ఖజానాపై పైసా కూడా భారం పడకుండా, నిర్మాణ యజమానుల నుంచి నిర్మాణ విలువలో 1 శాతం సెస్ రూపంలో వసూలు చేసిన వేలాది కోట్ల రూపాయలు నిర్మాణ కార్మికుల సంక్షేమం కోసమే ఖర్చు చేయాలని చట్టం చెప్తోందని పేర్కొన్నారు. సుప్రీం కోర్టు కూడా ఇదే విషయాన్ని ధ్రువీకరించిందన్నారు. ఈ పరిస్థితిలో చట్టవిరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వం ఇతర అవసరాలకు సెస్ నిధిని మళ్లించడం సరికాదన్నారు. ఇప్పటికే వివిధ కారణాలవల్ల నిర్మాణ కార్మికులు చేతి నిండా పనిలేక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఖజానాపై ఎటువంటి భారం లేకుండా కేవలం నిర్మాణ కార్మికుల కోసమే ఉద్దేశించబడిన సంక్షేమ చట్టం ఒకదానికొకటి ప్రత్యామ్నయం కాదన్నారు. దీనికితోడు కేంద్ర ప్రభుత్వం నిర్మాణ కార్మిక సంక్షేమ చట్టాన్నే రద్దు చేసే ఆలోచన చేసిందన్నారు. దేశవ్యాప్తంగా కార్మికవర్గం తెలియజేసిన తీవ్ర నిరసన ఫలితంగా వెనక్కి తగ్గిందని పేర్కొన్నారు. ఈ పరిస్థితుల్లో రాష్ట్ర ప్రభుత్వం మెమో 1214 ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న క్లెయిమ్‌లను వెంటనే చెల్లించాలన్నారు. నిర్మాణ యజమాని నుంచి వసూలు చేసిన సెస్ నిధులను ఇతర అవసరాలకు మళ్లించరాదన్నారు. సంఘీభావం తెలిపిన వారిలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ నిర్మాణ కార్మికుల న్యాయమైన డిమాండ్లకు తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిమ్మ ఉమా, పైల రాము, వాన అప్పారావు, బోర సూర్యనారాయణ పాల్గొన్నారు.

రాజధాని పేరుతో చంద్రబాబు దోపిడీ

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

రాజధాని పేరు చెప్పి వ్యాపారం చేసుకునే వ్యక్తి చంద్రబాబుకు పేదవాడి కష్టాలు ఎప్పుడు తెలుస్తాయని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. శ్రీకాకుళంరూరల్ మండలం ఇప్పిలిలో రూ.62 లక్షలతో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయ, రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. సచివాలయానికి, రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలకు స్థలం ఇచ్చిన దాత లోలుగు శ్రీనివాసరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 40 ఏళ్ల ప్రజా జీవితంలో చంద్రబాబు ప్రజలకు ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వాల పాలన కన్న భిన్నంగా సిఎం జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం పాలన సంబంధిత విధి విధానాలు ఉన్నాయన్నారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పాలన సంస్కరణలు తెచ్చి ప్రజా జీవితాల్లో ప్రియతమ ముఖ్యమంత్రి అన్ని తరగతుల్లో వెలుగులు నింపి వారి జీవన ప్రమాణాలను పెంచారన్నారు. అందుకు తగ్గ విధంగా సంక్షేమ పథకాలను రూపకల్పన చేసి నాటి పాదయాత్రలో ఆయన గుర్తించిన ప్రతి సమస్యకూ పరిష్కారం చూపారని పేర్కొన్నారు. ప్రతి హామీనీ అమలు చేశారన్నారు. మన పిల్లలు ఎదగాలని, అవకాశాలు అందుకోవాలని ఓ సదుద్దేశంతో విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొచ్చారని చెప్పారు. కార్పొరేట్ విద్యకు ధీటుగా ప్రభుత్వ విద్యను అందించేందుకు సర్కారు బడులను నాడు-నేడు పేరిట ఆధునికీకరించారని అన్నారు. అలానే కొత్త సిలబస్ రూపకల్పన, అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విధంగా ఆన్‌లైన్ మెటీరియల్ పంపిణీ, ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ వంటి ఎన్నో మంచి కార్యక్రమాలు చేపట్టారని తెలిపారు. ప్రతి గ్రామంలోనూ వెల్నెస్ సెంటర్ అందుబాటులోకి తీసుకొచ్చామన్నారు. లానే సంచార వైద్యశాలలూ ఉన్నాయన్నారు. మండలస్థాయిలో ఇద్దరు డాక్టర్లతో ఓ ఆస్పత్రి నడుస్తోందన్నారు. వైద్య ఆరోగ్య శాఖలో 58 వేల మంది వైద్య సిబ్బందిని నియమించామన్నారు. ఇది కాదా ఉత్తమ పాలన అని ప్రశ్నించారు. కార్యక్రమంలో సర్పంచ్ లోలుగు కనకమాలక్ష్మి ఎఎంసి చైర్మన్ ఎం.తాతబాబు, ఎంపిడిఒ సతీష్, తహశీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ రాజు, ఎం.వి.పద్మావతి, అంబటి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



నమూనా చెక్కును అందజేస్తున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

రైతు భరోసా, వడ్డీ మాఫీ విడుదల

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రైతు భరోసా, పిఎం కిసాన్ పథకం కింద రాష్ట్రంలోని రైతులు, కౌలు రైతులు, అటవీ భూముల సాగుదారులకు ఇస్తున్న సాయం సిఎం జగన్ బుధవారం విడుదల చేశారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ నమూనా చెక్కును విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 2023-24 మూడో విడతలో 1,25,655 మంది రైతులకు రూ.18.25 కోట్లు, రైతు భరోసా, పిఎం కిసాన్ ద్వారా 3,21,930 రైతు కుటుంబాలకు రూ. 64.47 కోట్ల పెట్టుబడి సాయం రైతుల వ్యక్తిగత ఖాతాలో జమ చేశామని తెలిపారు. రైతులకు సమయానికి ఉపయోగపడేలా రైతు భరోసా అందజేయడంతో మేలు చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నేతాజీ, అగ్రిమిషన్ సభ్యులు గొండు రఘురాం, జిల్లా వ్యవసాయ అధికారి కె.శ్రీధర్ పాల్గొన్నారు.

ఇవిఎం గోదాముల తనిఖీ

కలెక్టరేట్‌లోని ఇవిఎం గోదాములను, భద్రతా చర్యలను కలెక్టర్ డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ బుధవారం పరిశీలించారు. ప్రధానంగా గొదాం పరిసరాల్లో అపరిచిత వ్యక్తులు, అనుమతిలేని వారు సంచరించిన ఆనవాలు ఉంటే తక్షణమే ఉన్నతస్థాయి అధికారులకు తెలియజేయాలని ఆదేశించారు. నిరంతరాయంగా సిసి కెమెరాల పర్యవేక్షణ కొనసాగాలన్నారు. లోపాలకు తావు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం ఉంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇవిఎంలను భద్రపరిచిన తీరును పరిశీలించిన సాంకేతిక పరమైన అంశాలను అడిగి తెలుసుకున్నారు. పర్యవేక్షణ రిజిస్టర్‌ను తనిఖీ చేశారు. ఈయన వెంట జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ కూర్మారావు, చక్రవర్తి ఉన్నారు.

రేపు బార్ అసోసియేషన్ సమావేశం

శ్రీకాకుళం అర్బన్ : మార్చి 1న జిల్లా బార్ అసోసియేషన్ అత్యవసర సమావేశం నిర్వహిస్తున్నట్టు అధ్యక్షులు డాక్టర్ ఎన్ని సూర్యారావు ఒక ప్రకటనలో తెలిపారు. కోర్టు క్యాంటీన్ పాత బకాయిలను ప్రస్తుత లీజుదారు వద్ద నుంచి వసూలు చేయడం, ఏడాది కొనసాగింపుకు లీజుకు ఇచ్చేందుకు కార్యాచరణతో పాటు ఇతర అంశాలపైనా చర్చిస్తామన్నారు. ఈ సమావేశానికి బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు పాల్గొనాలని కోరారు.

అనుబంధ ఓటర్ల జాబితా రూపకల్పనలో జాగ్రత్తలు

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాలో పారదర్శక, దోష రహిత అనుబంధ (సప్లిమెంట్) ఓటర్ల జాబితాల రూపకల్పనకు యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అన్నారు. అనుబంధ ఓటర్ల జాబితా మార్పులు, చేర్పులు, రానున్న 2024 ఎన్నికల సన్నద్ధతపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లతో బుధవారం జెసి ఎం.నవీన్‌తో కలిసి 35వ వారపు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడిచిన వారం రోజుల్లో మార్పులు, చేర్పులు కోరుతూ 2715 మంది దరఖాస్తు చేసుకున్నారని అన్నారు. రానున్న ఎన్నికల నిర్వహణలో ఎలాంటి సమస్యలు తలెత్తకూడదనే ప్రధాన ఉద్దేశంతో ప్రతివారమూ రాజకీయ పక్షాల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్నామని చెప్పారు. ఎన్నికల్లో పోలింగ్ శాతం కనీసం 75 శాతం మించి ఉండాలనే లక్ష్యంతో ఓటర్లను అవగాహన కలిగించే స్వీప్ కార్యక్రమాలను ముమ్మరం చేస్తున్నామన్నారు. 80 ఏళ్ల వయస్సు పైబడిన, అలాగే నడవలేని, మంచం పట్టి ఉన్న వారు, వికలాంగుల ఓటర్లకు సంబంధించి ఇంటి దగ్గరే ఓటింగ్ నిర్వహణపై పరిశీలన చేస్తున్నామని చెప్పారు. ఇలా జిల్లా మొత్తం 49,957 మంది ఓటర్లను గుర్తించామన్నారు. వీరు ఇంటి నుంచే ఓటు వేసేందుకుగాను ముందుగా ఫారం-12 డి సమర్పించాల్సి ఉంటుందన్నారు. ఎన్నికల సమయంలో నగదు, మద్యం, తదితర పంపిణీ చేసి ఎన్నికల నియమావళిని ఉల్లంఘించే వారిపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇందుకు ప్రత్యేకంగా 18004256625 కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశామన్నారు. రోజూ ఉదయం 10 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పనిచేస్తుందన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, వైసిపి నాయకులు రౌతు శంకరరావు, టిడిపి నాయకులు పి.ఎం.జె.బాబు, బిజెపి నుంచి సురేష్‌బాబు సింగ్, సి సెక్షన్ సూపరింటెండెంట్ కూర్మారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

రైతులకు అండ

జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జై భారత్ నేషనల్ పార్టీ అధికారంలోకి రైతులకు అండగా నిలుస్తుందని అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా పర్యటనలో భాగంగా నగరంలోని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ భవనంలో బుధవారం ఆత్మీయ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం పార్టీ మేనిఫెస్టోను విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్రం ఇచ్చే రూ.ఆరు వేలు, రాష్ట్రం తరుపున రూ. పది వేలు వంతున రైతులకు ఏడాదికి రూ.16 వేలు చేయూత అందిస్తామన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫార్సులను తప్పనిసరిగా అమలు చేస్తామన్నారు. వ్యవసాయ కూలీ పెట్టుబడి ఖర్చుకూ సాయం అందిస్తామన్నారు. రైతుకు సమాజం తప్ప సామాజిక తరగతి ఉండదని అన్నారు. రైతు పండించిన పంటలన్నీ రాష్ట్ర ప్రభుత్వం కొనుగోలు చేయాలన్నారు. అప్పుడే మద్దతు ధర సాధ్యమవుతుందని అన్నారు. తమ పార్టీ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోలుకు ప్రత్యే కార్యాచరణను అమలు చేస్తామన్నారు. నియోజకవర్గ కేంద్రాన్ని అభివృద్ధి చేయడంతో పాటు సంపద సృష్టి కేంద్రాలుగా రూపొందిస్తామన్నారు. ఏటా రూ. 500 కోట్లతో ప్రతి నియోజకవర్గాన్నీ అభివృద్ధి చేస్తామని అన్నారు. మద్యం అమ్మకాలను నిరోధించడం కంటే ముందు అవినీతి లేని పాలన అందించాలన్నారు. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. దేశ భవిష్యత్, ప్రజల అభ్యున్నతి ప్రధాన అజెండాగా తాము పనిచేస్తామన్నారు. ఈ సారి వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో విశాఖ నుంచి తాను పోటీ చేస్తున్నట్టు ప్రకటించారు. లోక్‌సభ, శాసనసభల్లో దేనికి పోటీ చేయాలన్నది పార్టీ సమిష్టి నిర్ణయంతో ఉంటుందన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా జాతీయస్థాయి నిర్ణయం మేరకు తెలంగాణ, మహారాష్ట్రల్లో పోటీ చేస్తామన్నారు. అధికారంలోకి వస్తే అప్పులు లేని ఆంధ్ర రాష్ట్రం నిర్వహణకు ప్రాధాన్యత నిస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తరాంధ్ర కో-ఆర్డినేటర్ ఇంజరాపు జయదేవ్, అధికార ప్రతినిధి చౌదరి లక్ష్మణ్, శ్రీకాకుళం నియోజకవర్గ నాయకులు రాగోలు నాగశివ, పాతపట్నం నియోజకవర్గ ఇన్‌ఛార్జి బాలకృష్ణ పట్నాయక్ పాల్గొన్నారు.



లక్ష్మీనారాయణను సన్మానిస్తున్న నాయకులు

వంద పనిదినాలు పూర్తి చేయాలి



'ఉపాధి' కూలీలతో మాట్లాడుతున్న ఈశ్వరమ్మ

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

ఉపాధి పనులు ప్రారంభించి అందరికీ పనులు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గంగ రాపు ఈశ్వరమ్మ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. మండలంలోని కిష్టప్పపేటలో ఉపాధి పని ప్రదేశంలో కూలీలతో బుధవారం మాట్లాడారు. ఉపాధి కూలీలకు వంద రోజులు పని పూర్తికాని వారికే పనులు కల్పిస్తున్నారన్నారు. మిగిలిన కూలీలంతా పనులు లేక వలసలు పోవడానికి సిద్ధం అవుతున్నట్లు తెలిపారు. వెంటనే ప్రభుత్వం స్పందించి జాబు కార్డు ఉన్న ప్రతిఒక్కరికీ పని కల్పించి వలసలు పోకుండా నివారించాలన్నారు. కేంద్రంలో అధికారంలోని ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఉపాధి హామీని నిర్వీర్యం చేస్తూ పేదల నోటిలో మట్టి కొట్టేస్తుందని విమర్శించారు ఉపాధి హామీ నిర్వీర్యం చేస్తున్న కేంద్ర ప్రభుత్వాన్ని రాష్ట్రంలో అధికారంలో ఉన్న జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రశ్నించకపోవడం దారుణమన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం మార్చి 3న శ్రీకాకుళంలోని యుటిఎఫ్ కార్యాలయంలో జిల్లా సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. కూలీలందరూ పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి గంగరాపు సింహాచలం, ఎచ్చెర్ల దమయంతి, అరసవిల్లి రవణమ్మ, సాధు రోహిణి, గొండు గంగమ్మ, సిహెచ్.ధనలక్ష్మి, సింసిమ్మ రవణమ్మ, సాధు ధనలక్ష్మి పాల్గొన్నారు.

సమాజ సేవే సైన్స్ ధ్యేయం కావాలి

డిఇఒ వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి- టెక్కలి రూరల్


2023-24లో జిల్లా బాల శాస్త్రవేత్తలు సమాజంలోని సమస్యలను గుర్తించి వాటికి సాంకేతిక పరిష్కారాలు చూపడమే సైన్స్ ధ్యేయం కావాలని జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు అన్నారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన 'ఇన్స్పైర్ మనక్' అవార్డుల ప్రధానోత్సవంలో నోత్సవంలో పాల్గొన్నారు. తొలుత సైన్స్ పితామహుడు సి.వి.రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళ్లర్పించారు. సమగ్ర శిక్షా అభియాన్, పాఠశాల విద్య, ఎస్‌సిఇఆర్‌డి, యునిసెఫ్-విజ్ఞాన్‌ఆశ్రమ సంయుక్తంగా ఐతమ్-అటల్ ఇన్నోవేషన్ ఛాలెంజెస్ సెషన్-2ను నిర్వహించాయన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొన్న మూడు ఉత్తమ ప్రాజెక్టులను ఎంపిక చేసి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ మూడింటినీ రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్టు వెల్లడించారు. మహిళా రక్షణకు స్మార్ట్ స్టిక్కు తయారు చేసిన పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు బి.గాయత్రి, జస్వంత్ పాత్రో, ఢిల్లేశ్వరరావులకు ప్రథమ, ఒకే యంత్రం ద్వారా అనేక పనులు చేసే రోబోట్ను తయారు చేసిన పాతపట్నం ఎపి మోడల్ స్కూల్ అధ్యాపకుడు బి.చిన్నబాబు మార్గదర్శకత్వంలో విద్యార్థులు రోహిత్సాయి, ప్రీతమ్, నితీష్‌కు ద్వితీయ, ట్రాకింగ్ సోలార్ సిస్టమ్‌ను రూపొందించిన ఇప్పిటి జెడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాల విద్యార్థులు డి.నవీన్‌కుమార్, డి.దివాకర్, పి.వికాష్‌కుమార్‌లు ద్వితీయ బహుమతులు గెలుపొందారు. కార్యక్రమంలో ఎడిషనల్ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్.జయప్రకాష్, ఐతమ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, యునిసెఫ్ ప్రతినిధి టి.సుదర్శన్, విజ్ఞాన్ ఆశ్రమ్ మేనేజర్ కిషోర్‌గైక్వాడ్, జిల్లా సైన్స్ అధికారి కుమారస్వామిలు సైన్స్ అవశ్యకతను వివరించారు. ఐతమ్ ప్రిన్సిపాల్ సదస్సు కన్వీనర్ వ్యవహరించారు. కో-ఆర్డినేటర్లుగా మెకానికల్, హెచ్‌డి డాక్టర్ డి.శ్రీరాములు, డి.రఘువీర్, సహాయ కో-ఆర్డినేటర్లుగా డాక్టర్ పి.సుమన్, డి.భానుచంద్ర, ఎండసాగర్లు వ్యవహరించారు.



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న డిఇఒ వెంకటేశ్వరరావు

కార్యకర్తలు సిద్ధం కావాలి

వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్



శ్రీకాకుళం: రానున్న ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసిపి విజయం కోసం అధినేత జగన్ నిర్ధేశించించన సూచనల మేరకు కార్యకర్తలు సిద్ధం కావాలని వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశాన్ని విజయవంతం చేసిన జిల్లా నాయకులకు ధన్యవాదాలు తెలిపారు. అన్నిస్థానాల్లో విజయం కోసం చేయాల్సిన పనులేంటో సీఎం వైఎస్ జగన్ స్పష్టంగా చెప్పేశారని, ఆయన చెప్పినట్టు నేతలు ప్రజలకు, ఓటర్లకూ ఎప్పుడూ అందుబాటులో ఉండాలని సూచించారు. ముఖ్యంగా పోలింగ్ బూత్ నిర్వహణ, ప్లానింగ్‌పై దృష్టి పెట్టాలన్నారు. రాబోయే 45 రోజులు చాలా కీలకమన్నారు. చంద్రబాబులా తాము తప్పుడు హామీలు ఇచ్చి విస్మరించలేదని, ఇచ్చిన హామీలే అమలు చేసి చూపించామనే అంశాన్ని ఇంటింటికీ వెళ్లి చెప్పాలని అన్నారు. జగన్ ఉంటేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయని ఇంటింటికీ చెప్పాలన్నారు. వైసిపి ఓటేయకపోతే సంక్షేమం ఆగిపోతుందని హెచ్చరిం చాలన్నారు.

జైలు పక్షి చంద్రబాబా నన్ను విమర్శించేది?

అవినీతి కార్యకలాపాల్లో సిద్ధహస్తుడి గా జైలు ఊచలు లెక్కపెట్టి, జైలుకూడు తినొచ్చిన మాజీ సిఎం చంద్రబాబు నాయుడు నిజాయితీగా రాజకీయాలు చేస్తే.. తనపై ఆరోపణలు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నానని తెలిపారు. నిరాధారమైన ఆరోపణలు చేస్తూ నోటికి వచ్చిన కూతలు కూస్తే కనీస మర్యాద కూడా దక్కదని హెచ్చరించారు. తాను పోలాకిలో భూమి కబ్జా చేశానంటూ అసత్య ఆరోపణ చేసిన చంద్రబాబు ఆ విషయాన్ని రుజువుచేస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని అన్నారు.


అధికారులతో మాట్లాడుతున్న జెసి నవీన్

జెసి స్థల పరిశీలన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మెళియాపుట్టిలో సాయిబాబా ఆలయం వద్ద ఉండే ప్రభుత్వ స్థలాన్ని జెసి ఎం.నవీన్ బుధవారం పరిశీలించారు. స్థానికులకు ఆట స్థలం కోసం స్థలం కేటాయించాలని గ్రామానికి చెందిన శ్రీనివాసరావు జెసికి గ్రీవెన్స్‌లో విన్నవించారు. ఈ మేరకు జెసి స్థలాన్ని పరిశీలించారు. ఈయనతో పాటు తహశీల్దార్ జానకమ్మ, ఆర్ఐ వైకుంఠరావు, సర్వేయర్ చలపతిరావు, విఆర్ఒలు కె.శామ్యూల్, అన్నాజీరావు, మాధవ్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న విసి రజని

గ్రంథాలయం తనిఖీ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

అంబేద్కర్ యూనివర్శిటీలోని ప్రధాన గ్రంథాలయాన్ని డా.బిఆర్ఎయు వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.ఆర్.రజని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉద్యోగుల హాజరు శాతాన్ని పరిశీలించారు. కొంతమంది విధులకు ఆలస్యంగా రావడాన్ని గమనించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెవరు ఏయే విధులు నిర్వహిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. వర్శిటీ వర్గాలను, విద్యార్థులను ఆకట్టుకునేలా, అందుబాటులో ఉండేలా ఉద్యోగులు గ్రంథాలయాన్ని తీర్చిదిద్దాలని సూచించారు. విద్యార్థులతో స్నేహ పూర్వకమైన వాతావరణాన్ని కలిగి ఉండాలన్నారు. భవిష్యత్‌లో సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ భరత్ నాయక్

ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్లు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

సిఎం జగన్మోహన్‌రెడ్డి పేదలకు అందించిన జగనన్న ఇళ్ళ స్థలాలను రిజిస్ట్రేషన్ చేయడంలో ఎందుకు వెనుక పడుతున్నారని పలాస ఆర్‌డిఒ భరత్ నాయక్ విఆర్‌ఒలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పలాస తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం సచివాలయం, విఆర్‌ఒలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సచివాలయం పరిధిలో ఉన్న జగనన్న లబ్ధిదారులకు అవగాహన కల్పించి తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలన్నారు. జగనన్న ఇళ్ళ స్థలాల రిజిస్ట్రేషన్లు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎంత చెప్పినా మీలో మార్పు రావడం లేదని, ఇప్పటికైనా లక్ష్యాన్ని పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయనతో పాటు తహశీల్దార్ ఎస్‌విఎస్ నాయుడు, ఆర్ఐ నిరంజన్ పాల్గొన్నారు.

వాహనదారులకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలో విచ్చలవిడిగా అడ్డదిడ్డంగా ద్విచక్ర వాహనాలు పెట్టిన వాహన చోదకులకు పోలీస్ అధికారులు కౌన్సెలింగ్ ఇచ్చారు. బుధవారం సాయంత్రం సిఐ టి.ఇమ్మాన్యుల్ రాజు అధ్వర్యంలో ఇన్‌ఛార్జి ఎస్ఐ లక్ష్మీ నారాయణ, సిబ్బంది ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. పట్టణంలో వివిధ కూడళ్ల వద్ద ద్విచక్ర వాహనాలకు హ్యాండిల్ లాక్ వేయకుండా ఉంచిన వాహన చోదకులకు టౌన్ పోలీస్ స్టేషన్ వద్ద కౌన్సిలింగ్ ఇచ్చారు. వాహనాలు చోరీలకు గురికావడానికి కారకులవుతున్నారని హెచ్చరించారు. మరోసారి ఇటువంటి సంఘటనలు జరిగితే ఉపేక్షించేది లేదని సిఐ హెచ్చరించారు. ఒక్కసారి పోలీస్ అధికారులు ప్రత్యేక దాడులు చేపట్టడంతో వాహన చోదకులందరు పోలీస్‌స్టేషన్‌కు తరలివచ్చారు. ఈ కౌన్సిలింగ్‌లో టౌన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పవర్ బోరును ప్రారంభం చేస్తున్న శిరీష

అభివృద్ధి విడిచి ప్రజలతో రాజకీయమా?

ప్రజాశక్తి- పలాస

మందస మండలం సరియాపల్లి ప్రజలు తాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుంటే ప్రజల సమస్యలను పరిష్కరించక పోగా ఆ ప్రాంత ప్రజలతో వైసిపి నాయకులు రాజకీయం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆరోపించారు. సరియాపల్లిలో గౌతు లచ్చన్న బలహీనవర్గాల సంస్థ ఆధ్వర్యంలో తమ సొంత నిధులతో బుధవారం పవర్ బోరును ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో నీటి సమస్య తీవ్రంగా ఉందని ఎంపీ రామ్మోహన్ నాయుడు దృష్టికి తీసుకువెళ్ళగా ఎంపీ నిధులతో పవర్ బోరు ఏర్పాటుకు నిధులు మంజూరు చేయడం జరిగిందని చెప్పారు. గ్రామ పంచాయతీ వైసిపి నాయకులు బోరు ఏర్పాటుకు అనుమతులు ఇవ్వకపోగా బోరు ఎలా వేస్తారని బెదిరించినా ప్రజలకు తాగునీరు అందించాలనే ఉద్దేశంతో తమ సొంత నిధులతో పవర్ బోర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నోరియా హరిబంధు, మాజీ ఎంపిటిసి కలియ దశరథ, గ్రామ పార్టీ అధ్యక్షులు బాడపల్లి ఆనందరావు, ప్రధాన కార్యదర్శి బత్తిని గణపతి, మండల నాయకులు భావన దుర్యోధన, లబ్బా రుద్రయ్య, దాసరి తాతారావు, కొనారి తులసిరావు, మండల లాచయ్య పాల్గొన్నారు.

పార్వతీనగర్ కాలనీలో వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- పొందూరు

మండల కేంద్రంలోని పార్వతీనగర్ కాలనీలో ముగ్గురు చిన్నారులకు జ్వరాలు సోకడంతో తాడివలస పిహెచ్‌సి ఆధ్వర్యంలో బుధవారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీకి చెందిన 20 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. వీరిలో ఎవరికీ జ్వరాలు నమోదు కాలేదని వైద్య సిబ్బందికి తెలిపారు.


కాలనీవాసులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ఆవిష్కరణలతో నవశకం


ఎచ్చెర్ల : ప్రాజెక్టులను పరిశీలిస్తున్న కె.సి రెడ్డి


ఇచ్ఛాపురం : బహుమతులు అందజేస్తున్న చైర్మన్ కృష్ణమూర్తిరెడ్డి


పలాస : సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు


కవిటి : వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభిస్తున్న సర్పంచ్

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వ విద్యాలయంలో నిర్వహించిన మెగా సైన్స్ ఎగ్జిబిషన్‌ను ఛాన్సలర్ ఆచార్య కె.సి.రెడ్డి తిలకించారు. రాజీవ్ గాంధీ యూనివర్సిటీ విషయం విద్యార్థులు మొత్తం 200 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వంద శాతం నిర్వహించిన వర్కింగ్ మోడల్స్ విశేషంగా ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకట ధన బాలాజీ, ఒఎస్‌డి ఎల్.డి.సుధాకర్ బాబు, పరిపాలన అధికారి మునిరామకృష్ణ, డీన్ అకాడమిక్స్ మోహన్ కృష్ణ చౌదరి, డీన్ స్టూడెంట్స్ వెల్ఫేర్ గేదెల రవి, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ అసిరి నాయుడు, రమేష్ కుమార్, సివిల్ అధికారులు తేజకిరణ్, సురేష్ పాల్గొన్నారు.

కవిటి: విద్యార్థులు కొత్త కొత్త ఆవిష్కరణలతో నవశకానికి నాంది పలకాలని సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, ఎంఇఒ ధనుంజయ మజ్జి అన్నారు. మండలంలో కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఎస్‌విజె విద్యా సంస్థలు, కల్యాణి ఆంగ్ల పాఠశాలల్లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కవిటి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బెందాళం మల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముందుగా సివి రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. అనంతరం విద్యార్థుల రూపొందించిన పలు వైజ్ఞానిక ప్రదర్శనలు పరిశీలించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మండల కో-ఆప్షన్ మెంబర్ పాండవ చంద్రశేఖర్, ఎంపిటిసి పూడి నీలాచలం, విశ్రాంత వృక్షశాస్త్ర అధ్యాపకుడు పి.వెంకటరమణ, పిఎంసి చైర్మన్ ఎం.కృష్ణారావు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: సైన్స్‌తోనే మానవ మేధస్సు వికసిస్తుందని గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్ అన్నారు. డోకులపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా బుధవారం గ్రీన్ ఆర్మీ ఆధ్వర్యంలో సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రీన్ ఆర్మీ అధ్వర్యంలో చెర్రీ (మధుమేహ ఔషధ) మొక్కలను నాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జి హెచ్‌ఎం యవ్వారి కాంతారావు, ఉపాధ్యాయులు జి.భీమేశ్వరరావు, ఎం.రవీంద్రనాథ్ ఠాగూర్, డి.సత్యనారాయణ, కె.పుణ్యవతి గ్రీన్ ఆర్మీ సభ్యులు ఉదయ శంకర్ పాత్రో, విద్యార్థులు పాల్గొన్నారు.

పలాస: కాశీబుగ్గ శ్రీ సాయి శిరీష పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలను బుధవారం మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కవిటి భారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. కాశీబుగ్గ శ్రీ చైతన్య పాఠశాలలో ఎంఇఒ-2 చెరుకుపల్లి సత్యం విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టులను పరిశీలించారు. అనంతరం ఆయనకు పాఠశాల బృందం సన్మానించారు. కార్యక్రమంలో ఎంవి సురేష్, రాము మోహన్ నాయుడు, బాలరాజు పాల్గొన్నారు.

సోంపేట: మండలంలో బారువ ప్రాథమిక పాఠశాలలో సైన్స్ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. సైన్స్ దినోత్సవంలో భాగంగా నిర్వహించిన పోటీలకు విద్యార్థులు తయారు చేసిన సైన్స్ ప్రాజెక్టను ప్రదర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బూర్జ: మండలంలో ఒవిపేట ఆదర్శ పాఠశాలలో ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. సివి రామన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. విద్యార్థుల నిర్వహించిన వైజ్ఞానిక ప్రదర్శనలు అందరినీ ఆకట్టు కుంటున్నాయి. అనంతరం తెలుగు సైన్స్ పోటీ పరీక్ష నిర్వహించి విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.రాజశేఖర్. పి.రమణమూర్తి. సిహెచ్ సురేష్. ఆర్.భవాని, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: శాంతినికేతన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో జాతీయ సైన్స్ దినోత్సవం వైభవంగా జరిగింది. ఈ సభకు స్కూల్ చైర్మన్ దక్కత కృష్ణమూర్తి రెడ్డి అధ్యక్షత వహించారు. సైన్స్ డే సందర్భంగా స్కూల్ విద్యార్థులకు సైన్స్ ప్రాజెక్టలను నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ మేనేజర్ కేసి పూరి, ఉపాధ్యాయులు సురేఖ పట్నాయక్, శంకర్, శ్రీధర్, పద్మజ ఇంటరాక్ట్ క్లబ్ ప్రెసిడెంట్ డి.లక్ష్మీనరసింహారెడ్డి, సెక్రటరీ పి. తేజస్, ఎస్.పి.ఎల్ మాధవి పాల్గొన్నారు.

కొత్తూరు: స్థానిక మహర్షి ఉన్నత విద్యాలయంలో సైన్స్ దినోత్సవం సందర్భంగా ప్రిన్సిపాల్ ఎం.రాంబాబు ఆధ్వర్యంలో విద్యార్థులు పలు రకాల సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ప్రాజెక్టులు చూపరులను ఆకట్టుకున్నాయి.

ఆమదాలవలస : జాతీయ సైన్స్ దినోత్సవ సందర్భంగా పట్టణంలో భవిత హైస్కూల్‌లో చిన్నారులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి. నీటి పీడనంతో ప్రొక్లెయిన్ పనిచేసే ప్రాజెక్టు అందరిని ఆకర్షించింది. ఈ ప్రాజెక్టు తయారుచేసిన ఆర్. ప్రదీప్ కుమార్‌ను ప్రవాస భారతీయురాలు ఎస్.జ్యోతిలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సువ్వారి మురళీధరరావు, డైరెక్టర్ సువ్వారి సునీత, హెచ్‌ఎం కిల్లి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

టెక్కలి: సైన్స్ దినోత్సవం సందర్భంగా మండలంలోని నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో సైన్స్ ఉపాధ్యాయులు బడగల ప్రమీలారాణి, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శనలు చేపట్టారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఇసంపల్లి చిన్నవాడు, పాలవలస ధర్మారావు, రోణంకి విజయ్‌కుమార్, డొంకాన పాపారావు, మల్లీశ్వరీ పాల్గొన్నారు. అలాగే స్థానిక ఓక్లాండ్ పాఠశాలలో ప్రిన్సిపాల్ మల్లా మధులత పర్యవేక్షణలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. రవీంద్రభారతి పాఠశాలలో ప్రిన్సిపాల్ పద్మజ ఆధ్వర్యంలో నాసా పోటీలకు ఎంపికైన విద్యార్థులు రూపొందించిన సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగాం: మండలంలో లఖిదాసుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవం జరిగింది. పాఠశాల హెచ్‌ఎం కృష్ణారావు ఆధ్వర్యంలో .సివి.రామన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్ళర్పించారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రంకిడి రామారావు, తులసిప్రసాద్, ఉపాధ్యాయులు బాలక రామారావు, బెందాళం రత్నం, ప్రియదర్శిని, గోవిందరాజు, యాగాటి త్రినాదరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

సరుబుజ్జిలి: మండలం రొట్టవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం రామకృష్ణారావు ఆధ్వర్యంలో సైన్స్ దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు రూపొందించిన వందకుపైగా ప్రాజెక్టులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు తిలకించారు. వ్యాసరచన, కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మూడడ్ల రమణ, సైన్స్ ఉపాధ్యాయులు మీసాల వెంకటరమణ, రాజశేఖర్, జగన్, బోనెల రమేష్, మురళీ కృష్ణ, శారదాదేవి పాల్గొన్నారు.

పోలాకి : ఈదులవలస ఎపి మోడల్ స్కూల్, జూనియర్ కాలేజ్‌లో సైన్స్‌డే నిర్వహించారు విద్యార్థులు పలు ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ బొడ్డేపల్లి శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పొందూరు: మండలం మజ్జిలిపేట ప్రాథమికోన్నత పాఠశాలలో సైన్స్ దినోత్సవాన్ని హెచ్‌ఎం వావిలపల్లి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయురాలు మానేపల్లి రోజాను ఘనంగా సన్మానించారు. వివిధ ప్రయోగాలు చేపట్టిన విద్యార్థులకు బహుమతులు అందించారు.

శ్రీకాకుళం అర్బన్ : సైన్స్ ఎక్స్‌పో ప్రజలకు స్ఫూర్తినిస్తుందని ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. మహాలక్ష్మి నగర్ కాలనీ శ్రీచైతన్య పాఠశాలలో ప్రిన్సిపాల్ ఆర్.రాంప్రసాద్ అధ్యక్షతన జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో శ్రీచైతన్య సంస్థల ఉత్తరాంధ్ర, కోనసీమ జిల్లాల ఎగ్జిక్యూటివ్ ఎజియం ఎం.వి.సురేష్, ప్రభుత్వ మహిళా కళాశాల వృక్షశాస్త్రం ఉపన్యాసకులు ఎస్.రుద్రమరాణి, ప్రభుత్వ మహిళా కళాశాల జంతుశాస్త్రం ఉపన్యాసకులు ఐ.హేమపద్మజ, శ్రీచైతన్య పాఠశాలల రీజియన్ ఇన్‌ఛార్జి ఎస్.రామినాయుడు, ఉత్తరాంధ్ర జిల్లాల కో-ఆర్డినేటర్ ఎ.బాలరాజు పాల్గొన్నారు. ప్రభుత్వ మహిళా కళాశాలలో నిర్వహించిన సైన్స్ దినోత్సవంలో ప్రిన్సిపాల్ కె.సూర్యచంద్రరావు, వైస్ ప్రిన్సిపాల్ పి.శంకరనారాయణ, అకాడమిక్ కో-ఆర్డినేటర్ సిహెచ్.కృష్ణారావు, ఐక్యుఎసి కో-ఆర్డినేటర్ ఎస్.పద్మావతి, సైన్స్ అధ్యాపకులు డాక్టర్ ఎస్.స్వర్ణలత, డాక్టర్ సిహెచ్.లలిత, రుద్రమరాణి, ఐ.హేమపద్మజా, డాక్టర్ పి.సూర్యసునీత, శ్రీలక్ష్మి, వాణికుమారి పాల్గొన్నారు.


శ్రీకాకుళం అర్బన్ : వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్


బూర్జ : ప్రదర్శనలు తిలకిస్తున్న ఉపాధ్యాయులు


శ్రీకాకుళం అర్బన్ : ప్రాజెక్టులను పరిశీలిస్తున్న హెచ్‌ఎం రామారావు


ఆమదాలవలస : సైన్స్ ప్రాజెక్టులను తిలకిస్తున్న జ్యోతిలక్ష్మి


వజ్రపుకొత్తూరు : మొక్కలు నాటుతున్న గ్రీన్ ఆర్మీ సభ్యులు

విశాఖ స్కూల్‌లో...

నగరంలోని బ్యాంకర్స్ కాలనీలో ఉన్న విశాఖ స్కూల్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్-2 , సైన్స్ డే-2024 వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా శ్రీకాకుళం ఎంఇఒ కృష్ణారావు సందర్శించి విద్యార్థుల ప్రాజెక్టుల్లో సృజనాత్మకను ప్రస్తావించారు. ప్రీ ప్రైమరీ నుంచి తొమ్మిదో తరగతి వరకు గల విద్యార్థులు సైన్స్ డే థీమ్ 'విక్షిత్ భారత్ కోసం స్వదేశీ సాంకేతికత. 2024 ప్రధాన దృష్టి' అంశాలపై ప్రదర్శనలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.రామారావు పాల్గొన్నారు.

అమర్ కౌముదిలో...

నగరంలోని బలగలో ఉన్న అమర్ కౌముది స్కూల్‌లో సైన్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. అందులో భాగంగా విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహించారు. పిల్లలు తయారు చేసిన ప్రాజెక్టులు చూపరులను ఎంతగానో ఆకర్శించాయి. ముఖ్య అతిథిగా అంబేద్కర్ యూనివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ చింతాడ రాజశేఖర్ వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు.


టెక్కలి : మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ నూరుల్ కమర్

మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టి

ప్రజాశక్తి- టెక్కలి

రానున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై సంబంధిత ఎన్నికల అధికారులు దృష్టి సారించాలని సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. సబ్‌కలెక్టర్ కార్యాలయంలో బుధవారం నందిగాం, టెక్కలి మండలాల సెక్టోరియల్, అధికారులు, పోలీస్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల విధుల్లో పాల్గొనేందుకు వచ్చిన అధికారులు ఎటువంటి ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. అత్యవసర సమయాల్లో సౌకర్యాలు కల్పనకు కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉండేందుకు పోలీసులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో తహశీల్దార్లు, డిటిలు, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

పలాస: నియోజకవర్గం పరిధిలో చాలా ప్రాంతాల్లో కొత్త ఓట్లు నమోదు చేయడం, తొలగించడంపై అపోహలు పడవద్దని ఆర్‌డిఒ భరత్ నాయక్ అన్నారు. తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు జరిగిన ఓట్లు నమోదు, తొలగింపు ప్రక్రియపై ఆన్‌లైన్ చేయడం జరిగిందని, ఎన్నిక సమయానికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నామన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. సమావేశంలో పలాస, వజ్రపుకొత్తూరు, మందస మండలాల తహశీల్దార్లు ఎస్‌విఎస్ నాయుడు, సురేష్ కుమార్, తిరుమల బాబు, ఎలక్షన్ డిటి గిరి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు పాల్గొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి- కవిటి

అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఇచ్ఛాపురం తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించనున్న మహాధర్నా విజయవంతం చేయాలని ఎపిటిఎఫ్ జిల్లా అకడమిక్ కన్వీనర్ ఎల్.కరుణాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ధర్నాలో కవిటి మండలానికి చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు అధిక సంఖ్యలో పాల్గొని తమ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు.

కోటబొమ్మాళి: ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కారంలో ప్రభుత్వం దాటవేత దోరణిని నిరసిస్తూ గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట ఉదయం 10 గంటలకు ఎపిటిఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు మండల అధ్యక్ష, కార్యదర్శులు పి.రమేష్‌బాబు, సనపల మురళీధర్‌లు ప్రకటనలో తెలిపారు. వీరితో పాటు రాష్ట్ర కౌన్సిలర్లు ఎస్. నీలామోహన్, శ్రీనివాసరావు ఉన్నారు.

50 మందికి నేత్ర వైద్య పరీక్షలు

ప్రజాశక్తి- సోంపేట


గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఉచిత వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ ప్రతినిధి గణపతి అన్నారు. మండలంలోని కొర్లాం గ్రామ సచివాలయం వద్ద జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యాన ఆరోగ్యవరం కంటి ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. ఈ శిబిరంలో 50 మంది రోగులకు నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఏడుగురుకి నేత్ర శస్త్ర చికిత్సకు ఎంపిక చేశారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు, ఎఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ డిఇఇ బాధ్యతల స్వీకరణ


కృష్ణమూర్తి

టెక్కలి రూరల్ : టెక్కలి విద్యుత్‌శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా సిహెచ్.కృష్ణమూర్తి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో విజయనగరం జిల్లాలో ఎఇగా పనిచేశారు. ఉద్యోగోన్నతిపై ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఇంతవరకు పనిచేసిన సంతరావు శ్రీనివాస్ జిల్లా స్టోర్స్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలి డిఇ కార్యాలయం పరిధిలో వినియోగదారులు సమస్యలు పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటానని తెలిపారు.

సాంకేతికతతోనే అభివృద్ధి


అవగాహన కల్పిస్తున్న రబీంద్రషా

టెక్కలి రూరల్ : ఏకసిత్ భారత్-2047లో భాగంగా 'ఫ్యూచర్ ఆఫ్ మొబిలిటీ టెక్నాలజికల్ ఇన్నోవేషన్' అనే అంశంపై టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో టాటా టెక్నాలజీ స్ట్రాటజికల్ ప్రాజెక్టు చీఫ్ ఇంజినీర్ రబీంద్రషా ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సాంకేతికాభివృద్ధితోనే దేశాభివృద్ధి అవుతుందని అన్నారు. ఇంజినీర్లు ఈ దిశగా ఆలోచన చేయాలన్నారు. సహజ వనరుల వినియోగంతో పాటు వాతావరణ సమతుల్యత పాటించేలా సాంకేతిక విజ్ఞానం పెరగాలన్నారు. భావితరాలు భవిష్యత్ కోసం వనరులను మనము పొదుపు చేయాలన్నారు. సమాజ సేవ, దేశ నిర్మాణం, సంస్కృతిపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి. నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావులు మాట్లాడుతూ పారిశ్రామికీకరణకు అనుగుణంగా సిలబసను ఎప్పటికప్పుడు మార్చుకుంటూ విద్యార్థులకు అధిక ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సదస్సులో ఐఐసి ప్రెసిడెంట్ డాక్టర్ జి.సతీష్ కుమార్, హెచ్‌ఒడిలు, సదస్సు కో-ఆర్డినేటర్ వి.గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.


సచివాలయాన్ని ముట్టడిస్తున్న రైతులు

సచివాలయం ముట్టడి

బూర్జ: మండలంలో ఓవిపేట సచివాలయం ముట్టడికి బుధవారం పంచాయతీలోని రైతులు విఫల ప్రయత్నం చేశారు. ఓవీపేట సచివాలయం పరిధిలో లచ్చయ్యపేటలో సుమారు 74 ఎకరాల సాగు భూమిని అధికారులు గయాలోకి మార్చడం రైతులు ఆందోళనకు దిగారు. దశాబ్దాలుగా ఈ భూమిని సాగు చేస్తున్నప్పటికీ అన్ని విధాలుగా పాస్ పుస్తకాలు, సొసైటీలో రుణాలు పొందుతున్నామని అయితే సాగు భూమిని గయాలోకి మార్చడం ఎంతవరకు సమంజసమని రైతులు ప్రశ్నించారు. గతంలో ఈ విషయంపై తహశీల్దార్‌కు ఫిర్యాదు చేయగా ఈ ఏడాది జనవరి 9న తహశీల్దార్ గ్రామసభ నిర్వహించారన్నారు. అయితే రైతులకు దీనివలన ఎటువంటి ప్రయోజనం కలగలేదన్నారు. శాంతియుతంగా తమ సమస్యను తెలియజేసేందుకు రైతులందరూ వస్తే అడ్డుకోవడం తగదని రైతులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి రైతులు సాగులో ఉన్న భూమిని రైతులకే అప్పజెప్పాలని కోరారు. భారీ ఎత్తున రైతులు రావడంతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ మోసాల పట్ల ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆర్థిక అక్షరాస్యత కేంద్రం సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు అన్నారు. బుధవారం పట్టణంలో డిగ్రీ కాలేజీలో విద్యార్థులకు ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్‌ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు లావాదేవీలు, పథకాలపై అవగాహన కల్పించారు. బ్యాంకు నుంచి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్, ఎటిఎం వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వవద్దని సూచించారు. ఎటిఎంలో అపరిచితులకు కార్డును ఇచ్చి డబ్బులు విత్ డ్రా చేయించరాదన్నారు. బ్యాంకులో అమలవుతున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ పథకాల వివరాలను క్షుణ్ణంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైతే 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్ మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చునని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆర్‌డి సింధు, ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్ ఉషా పద్మిని, అధ్యాపకులు బి.శ్రీనివాసరావు, సాయి కుమార్, అష్టలక్ష్మి, రాజశేఖర్ పాల్గొన్నారు.

బిసి సంక్షేమ సంఘం డాక్టర్ సెల్
రాష్ట్ర అధ్యక్షులుగా సురేష్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వైద్య వృత్తిలో సామాజిక బాధ్యతగా గ్రామీణ ప్రాంతాల్లో వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి సేవలందిస్తున్న డాక్టర్ బొడ్డేపల్లి సురేష్‌ను బిసి సంక్షేమ సంఘం డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షునిగా బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లాకా వెంగళరావు యాదవ్ నియమించారు. ఈ మేరకు సంఘం కార్యాలయం నుంచి బుధవారం లిఖిత పూర్వకంగా నియామకపు పత్రాన్ని పంపించారు. బిసి సంక్షేమ సంఘం బలోపేతానికి ఆయన సేవలు అవసరమని భావించి ఈ నియామకం చేపట్టి నట్టు ఆ లేఖలో పేర్కొన్నారు. ఆయన నియామకంపై సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ రాజేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి దేవభూషణం హర్షం వ్యక్తం చేశారు.


షోరూమ్‌ను ప్రారంభిస్తున్న సురేష్

'యమహా బ్లూ స్క్వేర్' ప్రారంభం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వినియోగదారులకు విలువలతో కూడిన అన్ని సౌకర్యాలు యమహా బ్లూ స్క్వేర్ కంపెనీ అందిస్తుందని జోనల్ హెడ్ కెఎన్‌విఎస్ సురేష్ తెలిపారు. నగరంలోని పెదపాడు రోడ్డులో యమహా బ్లూ స్క్వేర్ షోరూమ్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యమహా బ్లూ స్క్వేర్ బ్రాండ్‌తో భాగస్వామ్యం చేసుకోవడాన్ని వారు గర్వంగా భావించేలా అనుభూతులను కలిగించడం మా ఉద్దేశమన్నారు. ప్రతి బ్లూ స్క్వేర్ ఔట్‌లెట్‌నూ బ్లూతో అంతర్జాతీయ గ్లోబల్ మోటర్‌స్పోర్ట్స్‌లో యమహా పోషించిన వాసరత్వాన్ని నిర్వచించే రీతిలో తీర్చిదిద్దాలన్నదే లక్ష్యమని చెప్పారు. ఈ బ్లూ స్క్వేర్ షోరూమ్‌లు బ్లూ స్ట్రీక్స్ రైడర్ కమ్యూనిటీకి వేదికగా కూడా నిలుస్తుందని చెప్పారు. ఇది వినియోగదారులు ఇతర యమహా రైడర్లను కలుసుకునేందుకు వీలుగా ఉంటుందని చెప్పారు. 150 సిసి నుంచి 400 సిసి వరకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. అలాగే స్పోర్ట్స్ బైక్ అందుబాటులో ఆర్-3, ఎంటీ 03 రేస్ వాహనాలు అందుబాటులో ఉంచామని చెప్పారు. బైకుతో పాటు గ్లౌజ్‌లు, ఎప్రల్స్, హెల్మెట్, ఎక్సీరీస్ వంటివి అందిస్తామన్నారు. కార్యక్రమంలో రీజనల్ బ్రాంచ్‌హెడ్ మహేష్, ఎ.ఎస్.ఎం.అన్వర్, సర్వీస్ మేనేజర్ భరత్ పాల్గొన్నారు.

దాతలు ముందుకు రావాలి

శ్రీకాకుళం అర్బన్: దాతలు సహృదయంతో స్వచ్ఛందంగా ముందుకొచ్చి ఆపదలో ఉండేవాళ్లని ఆదుకోవాలని శ్రీకాకుళానికి చెందిన స్మాల్ సర్వీస్ టు సొసైటీ ఫౌండర్ ప్రెసిడెంట్ కలివరపు సూర్యప్రకాష్ పిలుపునిచ్చారు. నగరంలోని బర్మా కాలనీలో నివాసముంటున్న మహిళ సుంకరి పార్వతికి స్మాల్ సర్వీస్ టు సొసైటీ (ఎస్ఎస్ఎస్) సభ్యుల సహకారంతో రూ.పది వేలు ఆర్థికసాయం, నిత్యావసర సరుకులు, రైస్ ప్యాకెట్ బుధవారం అందజేశారు. కార్యక్రమంలో స్మాల్ సర్వీస్‌టు సొసైటీ ప్రతినిధులు సింహాద్రి, కొండలరావు పాల్గొన్నారు.



మానవహారంలో ప్రతిజ్ఞ చేస్తున్న బిఎల్‌ఒలు, విద్యార్థులు

ఓటుహక్కుపై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

నియోజకవర్గం కేంద్రంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి బి.సుదర్శన్ దొర ఆధ్వర్యంలో ఓటుహక్కు ప్రాధాన్యతపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక రెవెన్యూ కార్యాలయం నుంచి బిఎల్‌ఒలు, విద్యార్థులు, విఆర్‌ఒలు, విఆర్‌ఎలతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఓటు యొక్క అవశ్యకత, రానున్న ఎన్నికల్లో అందరూ ఓటుహక్కు వినియోగించు కోవాలన్నారు. అనంతరం బస్టాండ్ జంక్షన్ వద్ద మానవహారం చేపట్టి సామూహిక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిటి శ్రీహరి, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్ తేదీ మార్పు

ప్రజాశక్తి- టెక్కలి

మార్చి 9న నిర్వహించాల్సిన లోక్ అదాలత్ మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా ఈ నెల 16న నిర్వహించనున్నామని జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు ప్రకటనలో తెలిపారు. వాయిదా పడిన విషయాన్ని కక్షిదారులు గ్రహించాలన్నారు. లోక్ అదాలత్‌ను వినియోగించుకుని సాధ్యమైనంత వరకు కేసులను రాజీ చేసుకోవాలన్నారు.

ఘనంగా టైలర్స్ డే

శ్రీకాకుళం అర్బన్ : రడీమేడ్ దుస్తుల వాడకం పెరిగిన తర్వాత టైలరింగ్ వృత్తిదారులకు జీవనం కష్టమవుతోందని, అందువల్ల 50 ఏళ్ల పైబడిన టైలర్లకు ప్రభుత్వ పింఛను ఇవ్వాలని టైలర్స్ అసోసియేషన్ జిల్లా ప్రతినిధులు శ్రీనివాస్ పండా కోరారు. నగరంలోని చౌక్‌బజార్ రోడ్డులో బుధవారం టైలర్స్ డే వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో సిమ్మ వేణుగోపాల్, వెంకట్, రాజు, భోగ ఈశ్వరరావు, బి.వి.రమణమూర్తి, బాబూరావు పాల్గొన్నారు.



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీ రామ్మోహన్‌నాయుడు

వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

గ్రామాల్లో ఆలయాలు నిర్మించటంతో ప్రజల్లో భక్తిభావం పెరుగుతుందని శ్రీకాకుళం ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. బుధవారం మండలం తిలారులో నిర్మించిన శ్రీ వెంకటేశ్వర ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపిపి తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, టెక్కలి నియోజకవర్గ తెలుగుయువత మహిళ అధ్యక్షులు పూజారి శైలజ, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్ పాల్గొన్నారు.

జనసేనతోనే పయనం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం



దుర్యోధన రెడ్డి

తన ప్రతి అడుగు పవన్ కళ్యాణ్ తోనేనని జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఇచ్ఛాపురం నుంచి జనసేన టికెట్ ఇవ్వకపోయినా ఆయన వెంటే నడుస్తానన్నారు. రానున్న ఎన్నికల్లో జనసేన, టిడిపి ఉమ్మడి అభ్యర్థిని గెలిపిస్తామని, ప్రభుత్వం ఏర్పడుతుందని చెప్పారు.

పోరాటాలతోనే 1108 జిఒ రద్దు

ప్రజాశక్తి- నౌపడ

పోరాటం ద్వారానే 1108 జిఒను రద్దు చేసుకోగలుగుతామని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) జిల్లా నాయకుడు నంబూరి వెంకటరావు అన్నారు. కాకరాపల్లి థర్మల్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో పోలీసుల కాల్పుల్లో అమరత్వం చెందిన జీరు నాగేశ్వరరావు, సీరపు ఎర్రయ్య, బత్తిన బారికయ్యల 13వ వర్ధంతిని బుధవారం నిర్వహించారు. ఈ మేరకు సంతబొమ్మాళి మండలం పోతునాయుడుపేట అమర స్మృతి స్థూపం వద్ద ప్రజాసంఘాల నేతలు ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్పొరేట్ దొంగల చేతుల్లో బందీగా ఉన్న వేల ఎకరాల భూములు స్వదేశీ మత్స్యకారులకు, పేదలకు దక్కాలంటే 1108 జిఒ రద్దు కావాలని, దానికి ఏకైక మార్గం సమరశీల పోరాటమని అన్నారు. సుమారు 60 గ్రామాల ప్రజలకు 13 ఏళ్లుగా పాలకవర్గ నేతలు ఓట్ల కోసం మోసపూరిత హామీలను ఇచ్చి వంచించారని విమర్శించారు. ప్రభుత్వం తక్షణమే జిఒను రద్దు చేయాలని, నాలుగు ప్రధానమైన కేసుల్లో పోలీసులు అక్రమంగా బనాయించిన సుమారుగా 400 మంది ప్రజలపైన ఉన్న కేసులను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాకరాపల్లి థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ కార్యదర్శి ఎం.నర్సింగరావు, నాయకులు గన్ను, కరుణ్య కేశవ, కోత మధు, సోమేశు, కోత రమణ, పద్మనాభం, హేమలత పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళ్లర్పిస్తున్న నాయకులు

ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే లక్ష్యం

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడమే మా లక్ష్యమని ఉద్దానం హెల్పింగ్ సొసైటీ ఫౌండర్ విజయ్ కుమార్ అన్నారు. కంబాలరాయుడు పేటకు చెందిన పత్రి వెంకటరమణ కొన్నాళ్లుగా క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. నిరుపేద కుటుంబం కావడంతో విషయం తెలుసుకున్న సొసైటీ సభ్యులు బుధవారం కంబాల రాయుడుపేటలో బాధితుడిని అతని స్వగృహం వద్ద రూ.10 వేలు నగదు ఆర్థికసాయం అందించారు. బాధితుడు బొంతలు కుట్టుకొని జీవనం సాగించేవాడు. క్యాన్సర్ కారణంగా జీవనోపాధి కోల్పోయి రోజు గడవడమే కష్ట తరంగా మారిందని బాధితుడు తమ వద్ద వాపోయినట్లు సొసైటీ సభ్యులు తెలిపారు. ఒక నెలకు సరిపడే సరుకులు కూడా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ప్రెసిడెంట్ తిరుపతి, లింగరాజు, శ్రీధర్, శివ, రాహుల్, పండా, షణ్ముఖ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.



ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

'అగ్నిపథ్'కు ఉచిత శిక్షణ



మాట్లాడుతున్న సుమన్ రెడ్డి

ఇచ్ఛాపురం: స్థానిక సురంగి రాజా క్రీడా మైదానంలో అగ్నిపథ్ ఎంపికకు కావాల్సిన శిక్షణ ఇవ్వటం జరుగుతుందని విశ్రాంతి ఆర్మీ అధికారి కెప్టెన్ దక్షత సుమన్ రెడ్డి తెలిపారు. బుధవారం కెప్టెన్ సుమన్ రెడ్డికి ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సీడప్ ఛైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్ రెడ్డి, క్రీడాకారులు ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్యామ్ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రిటైర్డ్ ఆర్మీ కెప్టెన్ దక్షత సుమన్ రెడ్డి, పట్టణంలో సురింగి రాజా వారి మైదానంలో ప్రజల ఆరోగ్యం బాగుండాలనే ఆలోచనతో తన సొంత నిధులతో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేయడం హర్షించదగ్గ విషయమన్నారు. మార్నింగ్ వాకర్స్, క్రీడాకారులతో కలసి సన్మానించారు. ఈ సందర్భంగా కెప్టెన్ సుమన్ రెడ్డి మాట్లాడుతూ ఇచ్ఛాపురం పరిసర ప్రాంతాల్లో గల ఆశక్తి గల అభ్యర్థులకు అగ్నిపథ్ సెలక్షన్లకు శిక్షణ ఇవ్వటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ గోవిందరెడ్డి, చాట్ల లోహిదాసు రెడ్డి, బ చ్చు జగన్, బత్తుల వెంకట రమణ పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందనలు

టెక్కలి: మండలం అక్కవరం ప్రాథమికోన్నత పాఠశాలలో 8వతరగతి చదువుతున్న విద్యార్థినులు కోనారి అమృత, కొర్రాయి భవానీలను పాఠశాల హెచ్‌ఎం పద్మావతి, ఎంఇఒ దల్లి తులసీరావురెడ్డి, దాసుపురం చిన్నారావు, సర్పంచ్ పొట్నూరు భూలక్ష్మి బుధవారం అభినందించారు. ఇటీవల గుంటూరులో రెండు రోజుల పాటు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరుపున పాల్గొని ప్రథమస్థానం సాధించి బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. దీంతో విద్యార్థినులను, వ్యాయామ ఉపాధ్యాయులు నీలయ్యను సిబ్బంది అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న సిబ్బంది

కుళాయి పనులకు శంకుస్థాపన



పైపులైన్ పనులకు శంకుస్థాపన చేస్తున్న వైఎస్ ఎంపిపి, తదితరులు

కొత్తూరు: మండలం కలిగాం గ్రామంలో తాగునీరు కోసం అదనపు పైపులైన్లు వేసేందుకు మండల పరిషత్ నిధుల నుంచి రూ.6 లక్షలు వైస్ ఎంపిపి, వైసిపి జిల్లా కోశాధికారి లోతుగెడ్డ తులసీ వరప్రసాదరావు మంజూరు చేయించారు. పైపులైన్ పనులకు బుధవారం వైస్ ఎంపిపి శంకుస్థాపన చేశారు. దీంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. వైసిపి నాయకులు అర్జున్, శ్రీను, పి.వెంకట కృష్ణ, లక్ష్మీ నారాయణ, పి.అచ్యుత, ధర్మారావు, అప్పల నాయుడు, కొవ్వాడ ఆనంద్, సూర్యనారాయణ, ధర్మారావు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న పద్ద గ్రామస్తులు

కొనసాగుతున్న దీక్షలు

ప్రజాశక్తి- కవిటి

తమ బిడ్డల ఉన్నత చదువులు, యువతీ యువకుల ఉద్యోగాన్వేషణ కోసం తమకు తప్పనిసరిగా కుల ధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాల్సిందేనని బెంతు ఒరియాలు స్పష్టం చేశారు. అంతవరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ఒంతుఒరియాలకు గుర్తింపు, తమ భవిష్యత్ భరోసా కోసం కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు బుధవారానికి 63వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా ఈ దీక్షలో పద్ద గ్రామస్తులు పాల్గొని తమ సంఘీభావం తెలిపారు. అనంతరం వీరు మాట్లాడుతూ ఒంతుఒరియాలకు గుర్తింపు లేకపోవడంతో విద్యార్థుల ఉన్నత చదువులు, నిరుద్యోగుల ఉపాధి గాల్లోపెట్టిన దీపంలా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పథకాలలకు దూరమవుతుందని తెలిపారు.

ఊపిరి ఉన్నంత వరకూ రక్తదానం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

73వ సారి రక్తదానం చేసిన పొట్నూరు ప్రతాప్‌ను, నవతరం సేవ సంఘం అధ్యక్షులు సుప్రజ, రౌత్, ఫౌండర్ రవితేజలను జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ బుధవారం అభినందించారు. జిల్లాలో సింగల్ డోనర్ ప్లేట్‌లెట్స్ కొరత ఎక్కువగా ఉందని, అపోహలు వీడి స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని ప్రతిప్ కోరారు. లక్ష్మీనారాయణ మాట్లాడుతూ మలేరియా, టైపాయిడ్, డెంగీ, చికున్‌గున్యా వంటి కేసులకు రక్త నమూనాలను సేకరించాల్సి ఉంటుందని అన్నారు. తరచూ ప్రజలు వీటి బారిన పడుతుంటారన్నారు. అటువంటి వారి కోసం స్వచ్ఛందంగా రక్తదానం చేయడం శుభ పరిణామమన్నారు.



మొక్కలు నాటుతున్న వైద్యాధికారులు, విద్యార్థులు

కొనసాగుతున్న ఎన్ఎస్ఎస్ శిబిరం

ప్రజాశక్తి- నరసన్నపేట

స్థానిక పద్మావతి డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విద్యార్థుల ప్రత్యేక శిబిరం 6వ రోజు బుధవారం కొనసాగింది. పచ్చదనం పరిశుభ్రతలో భాగంగా ప్రభుత్వ ఆస్పత్రిలో పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్, డాక్టర్లు పి జయశ్రీ, డాక్టర్ పి.సుస్మితలు పాల్గొని పారిశుధ్య కార్యక్రమాన్ని పరిశీలించి వాలంటీర్లను అభినందించారు. మొక్కలు నాటి కంచెలు వేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డి.వి.రమణమూర్తి, వైస్ ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాసరావు, ఎన్ఎస్ఎస్ పిఒ రాములు, విద్యార్థులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వీరఘట్టం ఎంపిడిఒగా సుబ్రమణ్యం

వీరఘట్టం: స్థానిక ఎంపిడిఒగా ఎంవిబి సుబ్రమణ్యం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన వంగర మండల ఎంపిడిఒగా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ ఎంపిడిఒగా విధులు నిర్వహించిన ఎస్.సాల్మన్‌రాజు బదిలీపై వంగర వెళ్లారు.

పోలింగ్ బూత్‌లో మారని వివరాలు

భామిని: సాధారణంగా ప్రతి పోలింగ్‌బూత్‌లో ఓటర్ సమస్యలు నివృత్తి చేయడానికి సంబంధిత బిఎల్ఒ పేరు, వివరాలు, కాంటాక్ట్ నెంబర్, పోలింగ్ స్టేషన్ నెంబర్‌ను పోలింగ్ బూత్ రాసి ఉంటాయి. కానీ బొమ్మిక 118 పోలింగ్ బూత్‌లో పాత బిఎల్ఒ పేర్లు, కాంటాక్ట్ నెంబర్లతో రాసిన వివరాలు కనిపిస్తున్నాయి. సదరు ఆ పోలింగ్ బూత్లో ఓటర్ సంబంధిత సమస్య ఉంటే ఎవరిని సంప్రదించాలి? అధికారులు చొరవ తీసుకుని ప్రస్తుత బిఎల్ఒ పూర్తి వివరాలు నమోదు చేయాలనిని ఓటర్లు కోరుతున్నారు.